# విరహిణి

**- డా. కొఠారి వాణీచలపతిరావు**

ఇల్లంతా సందడిగా ఉంది.

అందరూ హడావిడిగా ఉన్నారు. మాటిమాటికీ ఫోన్లు మోగుతున్నాయి. బంధువులు, స్నేహితులు వచ్చేవాళ్ళు వస్తున్నారు. వెళ్ళేవాళ్ళు వెళుతున్నారు. సూట్‌కేసు, బ్యాగ్ సర్దుకోవడంలో బిజీగా ఉన్నాడు హర్షవర్ధన్. ప్యాక్ చేసి ఉంచిన పచ్చళ్ళు, స్వీట్లు, హాట్స్ తెచ్చి అందిస్తూ తనూ బిజీగా ఉంది తల్లి లలితమ్మ.

ముందుగదిలో కొడుకుకి సెండాఫ్ చెప్పడానికి వచ్చిన ఇరుగుపొరుగులు, చుట్టాలు, స్నేహితుల మధ్య కూర్చుని అమెరికాలో తన కొడుకు చేయబోయే ఉద్యోగం గురించీ, ఇవ్వబోయే డాలర్ల జీతం గురించీ గర్వంగా చెప్పుకుంటున్నాడు తండ్రి మధుసూదనరావు.

ఇక ఇంటికి పెద్దాడపడుచు అయిన అక్క అనుపమ తమ్ముడికి హితబోధ మొదలుపెట్టింది. "తమ్ముడూ! ఇన్నాళ్ళకైనా విదేశాలకు వెళ్ళి డబ్బు సంపాదించి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఆలోచన నీకు వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. వచ్చిన జీతంలో కొంత నీ ఖర్చులకు వుంచుకుని మిగతాది నాన్నగారికి పంపించు. అమ్మను చూడు పాపం! వంటిమీద నగలన్నీ ఆ దివాలాకోరు వ్యాపారంలో పెట్టి బోసిమెడతో, వట్టి చేతులతో ఎలా తిరుగుతోందో! అమ్మను మనం మళ్ళీ ఆ మహాలక్ష్మిలా చూడాలంటే అది నీ చేతుల్లోనే ఉందిరా. ఈ ఇంటి ఆడపడుచుగా పుట్టింటి సుఖసంతోషాలు తప్ప నేను కోరుకునేది...నాకు కావాల్సింది ఏమీ లేదు.." అంటుంటే శ్రద్ధగా ఆమె మాటలు వింటున్నాడు హర్షవర్ధన్ చేస్తున్న పని ఆపకుండానే.

ఆ ఇంట్లో మరో ప్రాణి ఉంది. ఆమె హర్షవర్ధన్ భార్య చంద్రిక.

అసలు ఆమె ఒకతి ఇంట్లో ఉన్నట్టే అక్కడ ఉన్నవాళ్లకు ఎవరికీ గుర్తున్నట్టు లేదు. అటూ ఇటూ తిరుగుతూ ఎదురుగానే కన్పిస్తున్నా, ఎవరూ ఆమెను పట్టించుకోవడం లేదు. ఆమె మనసులోకి తొంగిచూసే ప్రయత్నం అస్సలు చెయ్యడం లేదు.

చంద్రిక కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్న నల్లమబ్బుల్లా ఉన్నాయి.

ఆమె మనసు తుపాను ముందు సముద్రంలా ఉంది.

వంటింట్లోకి వెళ్ళి ఏదో పని సవరిస్తూ ఉంటే ఉన్నట్టుండి అకస్మాత్తుగా గుండెల్లో నుంచి బాధ తన్నుకుని వచ్చి దుఃఖం పొంగుకుని వచ్చింది.

దాంతో అప్పుడే ఏదో గుర్తొచ్చినట్టు నటిస్తూ చకచకా బెడ్‌రూంలోకి వెళ్ళి తడికళ్ళను కర్చీఫ్‌తో అద్దుకుని మళ్ళీ బయటకు వచ్చింది.

పెళ్ళయి పట్టుమని పదినెలలు కూడా కాలేదు. వయసొచ్చిన నాటి నుంచీ... పెళ్ళయ్యే రోజు వరకూ దాదాపు పన్నెండు, పదమూడు సంవత్సరాలు దీర్ఘకాలం తను కన్నకలలూ, ఊహించుకున్న ఊహలూ ఫలించి ఇంకా ఎంతో కాలం కాలేదు.

ఆ తన్మయత్వం నుంచి, ఆ పారవశ్యం నుంచి తను తేరుకోనుకూడా కాలేదు.

అప్పుడే ఈ ఎడబాటు. మనసంతా దిగులుగా ఉంది చంద్రికకు.

'రెండు సంవత్సరాలు భర్తకు దూరంగా ఒంటరిగా ఈ ఇంట్లో ఎలా గడపాలి?' అన్న ప్రశ్న అంతకంతకూ ఆమె దిగులును అధికం చేస్తూ ఉంది. 'ఈ ఇంట్లో..ఈ పడకగదిలో తనకో అద్భుత ప్రపంచాన్ని చూపించాడు హర్ష. దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని...సహజీవనంలోని సంతృప్తిని, సంతోషాన్ని చవిచూపించాడు. వైవాహిక బంధం ఏర్పడిన కొద్దిరోజులకే బాధ్యతల పేరిట హర్షను తనకు దూరంగా పంపిస్తున్నారు అతని తల్లిదండ్రులు.

వాళ్ళ వయసుకు... వాళ్ల కుటుంబ సమస్యలకు అది సహజం కావచ్చు గానీ కనీసం తన భర్త అయినా అన్ని సంవత్సరాల తమ వియోగాన్ని గురించి ఆలోచించవద్దూ.

ఒకరికొకరుగా తనువూ, మనసూ మమేకం చేసి అత్యం సన్నిహితంగా గడిపిన తాము ఇప్పుడు అన్ని పగళ్ళు, అన్ని రాత్రులు..ఎవరికి ఎవరో అన్నట్టు ఎలా గడపగలరు?' అని ఆలోచిస్తోంది చంద్రిక.

'ఇంతకీ తను ఆలోచించినట్టే హర్షకూడా ఆలోచిస్తుంటాడా?

సంసార జీవితానికి సంబంధించిన విషయాలలో భార్యభర్తలిద్దరికీ ఒకేరకమైన ఆలోచనలు, అనుభూతులు, అనుభవాలు ఉంటాయా? హర్షను వదిలి ఉండవలసి వస్తున్నందుకు తన హృదయం స్పందించినట్లే అతని హృదయం కూడా అంతగా స్పందిస్తుందా?' అన్న సంశయం కూడా ఆమెకు కలుగుతోంది.

హర్షవర్ధన్ ఆ గదిలో అడుగుపెట్టాడు.

వాడిన గులాబీలా ఉన్న భార్య ముఖాన్ని...శ్రావణ మేఘాల్లా ఉన్న కళ్లనూ చూడగానే అతని మనసు జాలితో కరిగిపోయింది.

"చంద్రికా.." అంటూ ఆప్యాయంగా ఆమె భుజాల్ని తన చేతులతో చుట్టేశాడు.

అంతే అమాంతం అతని గుండెలమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది చంద్రిక.

"చంద్రికా నిన్ను వదిలిపెట్టి వెళ్లడం నాకూ బాధగానే ఉంది. కానీ ఏం చేస్తాం. తప్పదు" అన్నాడు హర్ష బాధగా. ఆ మాటలతో చటుక్కున తలెత్తి చూసింది చంద్రిక.

"ఏంటండీ తప్పదు? ఎందుకు తప్పదు? డబ్బే ప్రపంచమా..డబ్బు సంపాదన కోసం అన్ని సంవత్సరాలు...అంతదూరంలో మీరుంటే మనం ఒకళ్లనొకళ్లం ఎంత మిస్ అవుతామో...ఎన్నెన్ని అనుభూతులు ఎంతగా కోల్పోతామో మీకు తెలియదా? అసలు అన్ని రోజులు ఎలాగండీ మిమ్మల్ని చూడకుండా ఉండడం. ఎవరికి ఎవరమో తెలియనన్నిరోజులు ఏ బాధా ఉండదు. పదినెలలుగా ఒకరికొకరమై, ఇద్దరం ఒకటే అయి ఎంతో సన్నిహితంగా గడిపాం. ఇప్పుడు అనుకోకుండా వచ్చిన ఈ ఎడబాటును నేను ఎలా భరించను? ఒకరోజూ...ఒక నెలా...రెండు సంవత్సరాలు.." అంటూ ఆ తర్వాత

దుఃఖాన్ని ఆపుకోలేక బావురుమంది చంద్రిక.

భావావేశంతో ఈసారి ఘోరంగా భార్యను తన గుండెలకు హత్తుకున్నాడు హర్ష.

అలా చేస్తున్నప్పుడు అతనికీ దుఃఖం వచ్చింది. అయినా మగవాడు కనుక బయటపడలేదు.

"చంద్రికా! నువ్విలా బేలగా ఏడిస్తే చూసి తట్టుకోగల శక్తి నాకు లేదు. కొత్త ప్రదేశానికి..కొత్త మనుషుల మధ్యకి నా ఇంటిని నా వాళ్లను వదిలి వెళ్ళబోతున్న నాకు ఇలాగేనా వీడ్కోలు ఇచ్చేది? అక్కడ కొంచెమైనా మనశ్శాంతి లేకుంటే నా ఉద్యోగబాధ్యతలు నేనెలా నిర్వహించగలను.." అన్నాడే గానీ 'పోనీ వెళ్లనులే..' అనలేదు హర్షవర్ధన్.

దాంతో "వెళ్లక తప్పదంటారా?" అని ఆఖరి ప్రయత్నంగా అంది చంద్రిక.

"నువ్వు మానేయమంటే మానేస్తాను. కానీ అనుకోకుండా వచ్చిన మంచి అవకాశం. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు...అప్పులు.. వీటినుంచి కోలుకోవాలంటే ఇక్కడ ఉండి ఎన్ని సంవత్సరాలు సంపాదించినా సాధ్యమయ్యే పనికాదు.



## పొరపాటు

''డబ్బులు లేకుండా చైనీస్ హోటల్‌కెళ్లి టిఫిన్ తినడం పొరపాటయిపోయింది''

''ఏం చేసారేమిటి?''

''పది పాముల్ని దగ్గర పడేసి వాటి చర్మాలను వలవమన్నారు''

**-పద్మశ్రీ** (మాణిక్యారం)

## భయం

''నీకు డ్రైవింగ్ బాగా వచ్చుకదా. మరి ఇలా జరిగిందేమిటి యాక్సిడెంట్!''

''బస్టాప్‌లో మా ఆవిడ నిల్చుని వుంది. ఆమెను చూసి కంగారుగా పక్కకి తిప్పాను. అంతే... స్కూటర్ కాలువలోకి దిగింది.''

''మీ ఆవిడ నిన్ను చూసిందనుకో. ఏం జరుగుతుంది? అంత భయమెందుకు?''

''నన్ను చూస్తే ఫర్వాలేదుగానీ నా వెనుక కూర్చున్న చింతామణిని చూస్తుందేమోనని...''

## తినగ...తినగ...


''తినగ తినగ వేము తియ్యనుండు అంటే ఏంటి నాన్నా'' పదేళ్ళ మురళి షేవింగ్ చేసుకుంటున్న తండ్రిని అడిగాడు.

''వేపాకు తినగా తినగా తియ్యగా వుంటుందని అర్థం''

''అదెలా నాన్నా?''

''నేనే వున్నాను. పెళ్లయిన కొత్తల్లో అంట్లతోపాటు బట్టలు ఉతకడం కష్టంగా ఉండేది. ఇప్పుడు అలవాటుగా మారింది. అలాగన్నమాట'' భార్యవంక కొరకొర చూస్తూ చెప్పాడు భర్త.

**-వసుపులేటి సాయిలక్ష్మి** (నెల్లూరు)




అక్కడే ఏడాది...రెండేళ్లలో సంపాదించే డబ్బు..ఇక్కడ జీవితకాలంలో కూడా సంపాదించలేం. నాన్నగారు పెద్దవారవుతున్నారు. ఈ ఇంటి పెద్దకొడుకుగా నాకు కొన్ని బాధ్యతలున్నాయి. అమ్మా, నాన్న కంట తడిపెడితే చూడలేను నేను... ఇప్పుడు నువ్వే చెప్పు. వెళ్లమంటావా వద్దంటావా? ఈ ఇంటి కోడలిగా నీ బాధ్యతలను నువ్వు గుర్తిస్తావన్న నమ్మకంతో అడుగుతున్నాను..'' మునివేళ్లతో భార్య ముఖం పైకెత్తి కళ్లలో కళ్ళు పెట్టి చూస్తూ అడిగాడు హర్షవర్ధన్.

ముందరికాళ్లకు బంధం వేసినట్లు అలా మాట్లాడుతుంటే ఇక ఏమనగలదు.

ఏమన్నా ఇంటిల్లిపాదీ తననో స్వార్థపరురాలిగా చిన్నచూపు చూస్తారు. బాధ్యతలేని మనిషిగా ఈసడించుకుంటారు.

అందుకే మారుమాట్లాడకుండా అతని నుండి దూరమై మౌనంగా తనూ ప్యాకింగ్ పనిలో మునిగిపోయింది.

'పోనీలెండి అలాగే వెళ్లిరండి' అని కూడా అనలేదు. అలా అనబుద్ధి కూడా కాలేదు. ఇంటి బాధ్యతలు తప్ప ఇల్లాలి హృదయం అర్థం కాని ఆయన ముందు అలా బెట్టుగానే ఉండాలని అనిపించింది గానీ..రాజీ ధోరణిలో లొంగిపోవాలని అనిపించలేదు.

హర్షవర్ధన్ మనసులో ఏమనుకున్నాడో ఏమోగానీ తనూ మౌనంగా అక్కడినించి వెళ్ళిపోయాడు.

'ఆయనకు లేని బాధ నాకెందుకు? ప్రేమానురాగాలు సహజంగా మనసులోంచి పొర్లుకుని రావాలి గానీ అడిగి బ్రతిమిలాడి తీసుకునేవా? నాకింతే ప్రాప్తం అనుకుంటాను.

పుట్టిన మరుక్షణం నుంచే దురదృష్టం వెంటాడుతూ వస్తోంది. అలవాటయిపోయింది ఈ బతుక్కి... ఇదొకలెక్కా..?' అన్న నిరాశానిస్పృహలు ఆ తరువాత ఆమెని స్తబ్ధంగా ఉండేలా చేశాయి.

హర్షవర్ధన్..అతనితో పాటు కుటుంబసభ్యులు అందరూ సాయంత్రం నాలుగు గంటలకల్లా ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు.

తల్లిజాగ్రత్తలు చెబుతూ కళ్ల నీళ్ళు పెట్టుకుంది. తండ్రి తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో బాధను దిగమింగుకుని మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు.

అక్క కుటుంబ ఆర్థిక ఇబ్బందులను మళ్లీ ఏకరువు పెడుతూ తమ్ముడి బాధ్యతలను పదేపదే గుర్తుచేస్తూ ఉంది.

చంద్రిక మాత్రం కాస్తంత దూరంలో నుంచి ఫ్లయిట్ దిగి వస్తున్న జనాన్ని, ఫ్లయిట్ ఎక్కడానికి బోర్డింగ్ వైపు పోతున్న జనాన్ని చూస్తూ ఉంది నిర్లిప్తంగా.

"చంద్రికా! ఇంక టైం అయింది. వస్తాను" అన్నాడు హర్షవర్ధన్ భార్య భుజాన్ని ఆప్యాయంగా తడుతూ.

"..ఆ...ఓకే..విష్ యూ ఆల్‌ద బెస్ట్" పొడిగా అంది చంద్రిక.

"నిన్ను ఇలా వదిలేసి వెళుతున్నందుకు నా మీద నీకు కోపంగా ఉంది కదూ" భార్య చెవిలో రహస్యంగా అన్నాడు హర్షవర్ధన్. కంగారుపడింది చంద్రిక ఆ మాటలకి.

"ఇప్పుడు ఇంక మీరేం మాట్లాడొద్దు. టైం అవుతోంది వెళ్లండి" అంది.

ఆ సమయంలో ఆమె కళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి మళ్ళీ.

హర్షవర్ధన్ వెళ్ళిపోయాడు..వెళ్ళలేక వెళుతున్నట్లుగా.

హడావుడీ..సందడి. పదిపదిహేనురోజులుగా ఇల్లంతా అలుముకున్న చైతన్యం అన్నీ అతని వెంటే ఫ్లయిట్ ఎక్కి వెళ్లిపోయినట్లు అనిపించింది అందరికీ.

నీరసంగా అడుగులో అడుగేస్తూ వెయిట్ చేస్తున్న టాక్సీ దగ్గరికి వచ్చి అందులో కూర్చున్నారు.

తాళం తీసి లోపలికి అడుగుపెట్టగానే ఇల్లంతా బావురుమంటున్నట్లు అనిపించింది చంద్రికకు. తమ బెడ్‌రూమ్‌లోకి అడుగుపెట్టే సాహసం మాత్రం ఆ సమయంలో చెయ్యలేకపోయింది. ఇంటినిండా చిందరవందరగా పడి ఉన్న సామాన్లను ఎక్కడివక్కడ చేర్చే పనిని కావాలని కల్పించుకుని దుఃఖాన్ని తాత్కాలికంగా మర్చిపోయే ప్రయత్నం చేసింది.

ఉన్నట్టుండి ఎందుకో అత్తగారు చంద్రిక దగ్గరకు వచ్చి "అమ్మాయ్ చంద్రికా... బాధపడకు. ధైర్యంగా ఉండు. రోజూ నీకు ఫోన్ చేయమని వారానికి ఒక్కసారైనా ఉత్తరం రాయమని వాడికి చెప్పాను. నీకు ఏది కావాలన్నా మేమందరం ఉన్నాం. నిస్సంకోచంగా అడుగు" అంటూ ధైర్యవచనాలు చెప్పింది.

ఆ మాటలు విని నిర్లిప్తంగా తనలో తనే నవ్వుకుంది చంద్రిక.

ఆమధ్య ఏదో పనిమీద మామగారు వారంరోజులు మద్రాసు వెళితే ఇక్కడ అత్తగారు "ఏమీ

తోచడం లేదు'' అంటూ చిన్న ముఖం చేసుకుని ఎంత అస్థిమితంగా, ఎంత దిగులుగా, ఏదో కోల్పోయినట్లు ఇంట్లో ఎలా తిరిగారో చప్పున గుర్తుకువచ్చింది ఆ సమయంలో చంద్రికకు.

* * *

చంద్రిక జీవితం వడ్డించిన విస్తరికాదు.

ఆమె బాల్యం...తీపి జ్ఞాపకాలుగా గుర్తుంచుకోవలసినంత అందంగా ఏమీ గడవలేదు.

పుడుతూనే తల్లిని పోగొట్టుకుంది. ఊహ తెలిశాక తండ్రిని పోగొట్టుకుంది. మొదట మేనత్తలు... ఆ తరువాత అన్న వదినలు తప్పనిసరై ఆమెను పెంచి పోషించారు.

ఇంట్లో ఎంతమంది తిరుగుతున్నా చంద్రిక మనసులో మాత్రం ఎప్పుడూ ఒంటరితనమే. అలాంటి పరిస్థితుల్లో ఆమెకు పుస్తకాలు తోడు అయ్యాయి.

వాటితోనే ప్రపంచాన్ని చదివింది. మనిషి ఎదగాలంటే కావాల్సింది ఏమిటో తెలుసుకుంది. అది తెలుసుకోగానే చదువుమీద శ్రద్ధ పెట్టింది. ఇంటికన్నా స్కూలులోనే తనకు బాగుంటున్నట్లు కూడా అనిపించింది.

భగవదత్తంగా అబ్బిన తెలివితేటలకు కృషిని జోడించి విజ్ఞానరంగంలో ఒక్కొక్క అడుగేవేస్తూ ముందుకు నడిచింది.

పిజి చదివి ఆ తరువాత పరిశోధన కూడా చేసి తెలుగు లెక్చరర్‌గా స్థిరపడిపోయింది. అందులో అయిదేళ్ళ అనుభవాన్ని కూడా గడించింది.

అప్పటికి చంద్రికకు ముప్పయేళ్ళు వచ్చాయి. అంత బిజీ లైఫ్ లోనూ పెళ్ళిని గురించిన మధురోహాలు అప్పుడప్పుడు మనసులో మెదిలి చంద్రికను ఉక్కిరిబిక్కిరి చేస్తుండేవి.

వృత్తిలో స్థిరపడ్డ తర్వాత జీవితంలోనూ స్థిరపడాలమన్న కోరిక గాఢంగా కలగడం మొదలుపెట్టింది.

అయినా ఎలా? ఇంట్లో ఎవ్వరూ తన పెళ్ళి మాట ఎత్తందే? ఆ ప్రస్తావన తెస్తే ఎక్కడ బాధ్యతంతా తమ మీద పడుతుందోనని ఎవరికివారు 'మాకేం పట్టింది' అన్నట్టు తప్పించుకుని తిరిగేవారు.

పెద్దన్నయ్యకు అప్పుడప్పుడూ కాస్త బాధ్యత గుర్తుకొచ్చినా వదిన పడనిచ్చేదికాదు.

"మీరొక్కరేనా తనకు అన్న? ఇంకా ఉన్నారుగా వాళ్లను కూడా ఖర్చులు భరించమనండి. పెళ్లంటే ఊరికే అవుతుందా?'' అని సాధిస్తూ ఆయన్ని ముందుకు అడుగెయ్య నిచ్చేదికాదు.

అన్నలు, అత్తలు అందరూ తన పెళ్ళి గురించి నువ్వంటే నువ్వని పోటీపడుతుండడం చూసి ఇలా అయితే ఇది అయ్యే పని కాదనుకుని తన భర్తను తనే వెదుక్కునే ప్రయత్నం చేసింది చంద్రిక.

ఇంటర్నెట్‌లో చూస్తూంటే హర్షవర్ధన్ ఫోటో, బయోడేటా ఆమెను ఆకర్షించాయి. వెంటనే మెయిల్ ఇచ్చి తన వివరాలు చెప్పింది. ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకుని ఒకరి అభిప్రాయాలు ఒకరు అడిగి తెలుసుకుని, ఆఖరున పెద్దలను ప్రవేశపెట్టి ఆ విధంగా పెళ్ళి చేసుకున్నారు హర్షవర్ధన్, చంద్రిక.

ప్రతినెలా జీతంలో దాచుకున్న డబ్బులు లక్షన్నర తెచ్చి అన్న చేతిలో పెట్టి "పెళ్ళిఖర్చులకు...'' అని చెప్పింది.

పీటలమీద కూర్చుని కన్యాదానం చేయడం తప్ప వాళ్ళుగానీ, మరొకరు గానీ చేసింది ఏదీ లేదు.

తన పెళ్ళి తనే స్వయంగా చేసుకుంది చంద్రిక.

హర్షవర్ధన్ ఆమెను ఇష్టపడడానికి కూడా కారణం అదే.

'చంద్రిక కష్టం, సుఖం తెలిసిన మనిషి. తెలివిగలది, చదువుకున్నది తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తను ధైర్యంగా తీసుకోగలది. ఇలాంటి అమ్మాయి నా జీవిత భాగస్వామి అయితే ఇంక కావాల్సింది ఏముంది?' అన్న ఆలోచనే ఆమె మెళ్ళో మూడుముళ్ళు వేసేలా చేసింది. దాంతో


పెళ్ళి చంద్రిక జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ అయింది.

ఎవరూలేరనుకున్న తనకు నీకు నేనున్నాను, నువ్వు నా ప్రాణం, నువ్వే నా సర్వస్వం అంటూ హర్షవర్ధన్ అకస్మాత్తుగా ఆమె జీవితంలోకి ప్రవేశించి ఉక్కిరిబిక్కిరి చేశాడు.

భర్త గుండెల మీద తల పెట్టుకుని పడుకుంటే ఎంతో ఆనందం, ఎంతో తృప్తి, ఎంతో రక్షణ దొరుకుతున్న అనుభూతిని పొందేది.


తన జీవితానికి ఓ అర్థం, పరమార్థం, నిండుతనం లభించినట్లు అనిపించేది.

"హర్షా! మీరాకతో నా జీవితం ధన్యమైంది. నా తల్లితండ్రి, నా గురువు, దైవం అన్నీ మీరే...'' అని ఆనందిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఇలా విదేశంలో భర్త అంత దూరం.. ఎప్పుడో తప్ప... మాటిమాటికీ కనిపించనంత దూరం వెళ్ళిపోవడం



## విలక్షణత

అమీషాపటేల్ ఎప్పుడూ విలక్షణంగా ఆలోచిస్తుంది. వెరైటీగా మాట్లాడుతుంది. ఆమెలో ఓ ఫిలాసఫర్‌తో పాటూ ఓ జర్నలిస్ట్ కూడా దాక్కుంది అంటుంటారు ఆమె సన్నిహితులు. ఈమధ్య ఆమె పుస్తకాలు చదవడంలో బాగా బిజీగా అయిపోయింది. పుస్తకం చదవడంలో అన్ని కోణాల్ని ఆమె స్పృశిస్తుందిట. అందులో తనకి నచ్చిన కొన్ని పాయింట్స్‌ని ఆమె నోట్ చేసుకుని వాటిని అవసరమైనప్పుడు తన సంభాషణల్లో ఉపయోగిస్తూ ఉంటుందిట. ఇప్పుడు తనని కలవడానికి వచ్చే మిత్రులకి ఆమె ఓ సలహా ఇస్తోందిట. అదేంటో తెలుసా! పుస్తకాలు బాగా చదవమని.





# మళ్లీ వచ్చేసింది

ఆంత్రామాలి ఇప్పటివరకూ ఎక్కడికెళ్లిందని అడక్కండి. రాము కార్పోరేషన్ సినిమాలు తప్పితే ఆమె ఎక్కడా కన్పించదని విమర్శలు చేసేవారికి ఆంత్రామాలి ఏం సమాధానం చెబుతోంది. వారికి సమాధానం ఇవ్వకుండా 'మాయం' అయిపోతుందేమో. తాజాగా ఆమె నటించిన ఈ చిత్రం గురించే అంతా చర్చించుకుంటున్నారు. 'నా టాలెంట్ చూపించడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు' అని ఘంటాపథంగా చెప్పే ఆంత్రామాలి తనకి సరైన బ్రేక్ ఇప్పటికీ రాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తుంటుంది. ఆ బ్రేక్ ఎప్పుడు వస్తుందో?

జీర్ణించుకోలేకపోతున్నది చంద్రిక.

అదొక షాక్‌లా ఆమె మనసుకు వచ్చి తగిలింది.

దూరమై పోయిందనుకున్న ఒంటరితనం మళ్లీ దగ్గరై 'నిన్ను వదిలి నేను పోలేను' అని ఎగతాళిగా నవ్వినట్లు అనిపించింది. దాంతో పిచ్చెక్కిపోతోంది చంద్రికకు.

★ ★ ★

ఆ రాత్రి భోజనం అయిందనిపించి పడుకోవడానికి బెడ్‌రూంలోకి అడుగుపెట్టిన చంద్రికకు భర్త హర్షవర్ధన్ లేని పక్క బోసిగా, ఖాళీగా అనిపించి దుఃఖం పొర్లుకుని వచ్చింది.

అంత పెద్ద బెడ్ మీద ఒంటరిగా ఓ పక్కన పడుకుంటే పదే పదే ఆమెకు భర్త గుర్తుకు వచ్చి ఆ ఎడబాటు ఆమె మనసును రంపపుకోత కోసింది.

"నావాడు..నా సర్వస్వం" అనుకున్న మనిషి కంటికి కనిపించకుండా స్పర్శించడానికి వీలులేనంత దూరం వెళ్ళిపోతే ఆ వియోగం ఎంత బాధకరమో మొదటిసారి ఆమెకు అనుభవమైంది. ఆమెకు అక్కడ ఒక్క నిముషం కూడా ఉండబుద్ధి కాలేదు.

మెత్తటి ఆ పరుపు ముళ్లకంచెలా గుచ్చుకుంటున్నట్లు అనిపించగానే చకచకా స్టెయిర్‌కేస్ తలుపు తీసుకుని మేడమీదికి వెళ్లింది చుట్టూ ఒకసారి కలియచూసింది.

ఆరోజు పౌర్ణమి కాబోలు.. మేడమీదంతా తెల్లటి...చల్లటి వెన్నెల..అందంగా పరచుకుని ఆహ్లాదంగా అనిపించింది. పైన ఆకాశం మీద పాల పుంతలా...వెన్నముద్దలా కొలువైన చంద్రుడు.. ఎందుకో తనను చూసి చిలిపిగా నవ్వుతున్నట్టు ...హేళన చేస్తున్నట్టు అనిపించింది.

దానికితోడు నేలమీద నుండి మేడమీదికి ఎగబాకిన సన్నజాజి తీగ నిండుగా పూలతో పరిమళాలను వెదజల్లుతూ కనిపించింది.

'నా ప్రాణానికి ఈరోజు పౌర్ణమి ఎందుకు కావాలి. అమావాస్య అయినా బాగుండేది. నా మనసులోని చీకటికీ దానికీ సరిజోడి కుదిరిపోయేంది'' అని మనసులోనే విసుక్కుంది చంద్రిక.

తనను అంతగా ఉద్దీపనకు గురిచేసి...మనసులోని మంటను మరింత రగిలిస్తున్న ఆ వెన్నెల, ఆ చల్లగాలి, ఆ పూల పరిమళం నుంచి దూరంగా పారిపోవడం కోసం తిరిగి బెడ్‌రూంలోకి వచ్చి మంచం మీద పడి... దిండును అక్కున చేర్చుకుని అర్ధరాత్రి దాటిం తర్వాత ఎప్పటికో నిద్రపోయింది చంద్రిక.

★ ★ ★

కొన్ని కొన్ని సందర్భాలు, సంఘటనలు... అదేమిటో అనుకోకుండా ఒకదానికొకటి లింకు పెట్టుకుని అనూహ్యంగా కళ్లముందు ప్రత్యక్షమై ఆశ్చర్యపరుస్తూ ఉంటాయి. కో ఇన్సిడెన్స్..సినిమాల్లోనే కాదు... ఒక్కోసారి జీవితంలోనూ జరుగుతుంటాయి.

ప్లాన్ ఆఫ్ సిలబస్ ప్రకారం ఆరోజు క్లాసులో చెప్పాల్సిన పాఠాన్ని పిరియడ్ ప్రారంభం కాబోయే ముందు ఓసారి చూసుకున్న చంద్రిక ఆశ్చర్యపోయింది.

జానపద సాహిత్యంలో "ఊర్మిళాదేవి నిద్ర..అది.. అది చెప్పాలంటే పద్నాలుగు సంవత్సరాలు ఊర్మిళాదేవి ఎందుకు నిద్రపోయిందో చెప్పాలి ముందు. భర్త విరహాన్ని భరించలేక సీత పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చేసింది..రాణివాసం వదిలిపెట్టి. అయినా ఆమె భర్త చెంతనే ఉంది.

భర్తతో కలిసి ఉంటే అడవి అయినా అదే అంతఃపురం అనీ..భర్తను విడిచి దూరంగా ఉండవలసి వస్తే అంతఃపురంలో ఉన్నా అది నరకసదృశమని ఆమెకు తెలుసు. అందుకే తెలివిగా ఎంతమంది 'వద్దు..వద్దు' అని వారించినా వినకుండా మొండికేసి మొగుడివెంట అడుగులో అడుగేస్తూ అడవికి వెళ్ళిపోయింది. కానీ లక్ష్మణుడి భార్య ఊర్మిళ విషయం అలాకాదు. ఆమె పధ్నాలుగు సంవత్సరాలు భర్తను వదిలి అయోధ్యలోనే ఉండిపోయింది.

అందుకే జానపద స్త్రీలకు ఆమె అంటే జాలి. సీత పాత్ర మీద కన్నా ఊర్మిళ పాత్ర మీదనే వాళ్లకు సానుభూతి ఎక్కువ.


అందుకే అంతటి దీర్ఘ విరహం ఆమెకు అనుభవానికి రాకుండా ఉండడం కోసం పధ్నాలుగు సంవత్సరాలు ఆమెను నిద్రపుచ్చారు.

ఆడదాని బాధ ఆడదానికే తెలుస్తుందంటారు అందుకే. వాల్మీకి చేయలేని పనిని జానపద స్త్రీలు చేశారు'' అంటూ ఇదంతా తను ఇప్పుడు క్లాసులో చెప్పాలి.

చెప్పింది బుద్ధిగా విని బుర్రలూపే పిల్లల కాలమా ఇది?

'విరహం' అంటే ఏమిటి మేడమ్? దాన్ని అగ్నితో ఎందుకు పోల్చారు?

నిజంగా ఆ బాధ అంత భరించలేనిది ఉంటుందా?' లాంటి ప్రశ్నలేస్తే తను ఏమని సమా



ధానం చెప్పాలి?

ఈమధ్యనే పదినెలల క్రితమే తన పెళ్ళయిన సంగతి ఈ పిల్లలకు తెలుసు.

తన భర్త ఫారెన్ వెళ్ళిన విషయమూ తెలిసే ఉంటుంది.

లెక్చరర్ల పర్సనల్ జీవితంలోకి తొంగి చూడడం కొంతమంది విద్యార్థులకు సరదా...అంతేకాదు ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్స్‌ని బట్టి, ఆ రోజు పాఠం తీరుని బట్టి మేడమ్ ఏ మూడ్‌లో ఉన్నారో కనిపెట్టి..దానికి చిలవలు పలవలు చేర్చి నవ్వుకుని ఎంజాయ్ చేయడం చేస్తుంటారు. కనుక ఈరోజు చాలా జాగ్రత్తగా ఉండాలి.

పిల్లలముందు ఏ మాత్రం బయట పడకూడదు' అనుకుంటూ పుస్తకం తీసుకుని క్లాస్‌రూంకి వెళ్లింది చంద్రిక. అనుకున్నట్టుగానే-

పిల్లల ముసిముసి నవ్వులు, కొంటె ప్రశ్నలు, తన కళ్లల్లోకి గుచ్చిగుచ్చి చూడటాల మధ్య యాభై నిముషాల క్లాసు గడిచిపోయింది. క్లాసు నుంచి బయటకి వస్తూ తమాషాగా అనుకుంది చంద్రిక.

'ఆ ఊర్మిళాదేవిలా తనూ తన భర్తకు దూరంగా ఉండాల్సిన ఈ రెండు సంవత్సరాలూ నిద్రపోగలిగితే ఎంత బాగుంటుంది' అని. వచ్చి తన సీటులో కూర్చున్నా చంద్రిక మనసును ఆలోచనలు వదిలిపెట్టలేదు.

* * *

ఆరోజు చంద్రిక కాలేజ్ నుంచి ఇంటికొచ్చేసరికి ఇంట్లో అందరూ ఎందుకో సంతోషంగా కనిపించారు. అందరూ ఎందుకో సంతోషంగా కనిపించారు.

అందరి ముఖాలూ ఎందుకో తెలియని కాంతితో వెలిగిపోతున్నాయి. కాళ్ళు కడుక్కుని వంటగదిలోకి వెళ్లగానే "రామ్మా చంద్రికా. టిఫిన్ తిందువుగాని" అని ఆప్యాయంగా పలకరించింది అత్తగారు.

ఆవిడ రోజూ ఆ సమయానికి అదే డైలాగ్ అంటుంది.

రోజూ ఆప్యాయంగానే పలకరిస్తుంది. అయినా ఆరోజు అందులో ఏదో ప్రత్యేకత కనిపించింది చంద్రికకు.

ఉప్మా నోట్లో పెట్టుకుంటుంటే అంది అత్తగారు.

"ఈరోజు పెద్దోడు అమెరికా నించి డాలర్లు పంపించాడు. మొదటి జీతం వచ్చిందట. అత్యవసర అప్పు ఏదో తీర్చడానికి మీ మామగారు కొన్ని తీసుకోగా మిగిలినవి అల్మారాలో పెట్టాను. నీకూ ఏదైనా అవసరం ఉంటే తీసుకుని వాడుకోమ్మా"

అది విన్నాక వాళ్ళ పుత్రోత్సాహం అప్పుడు అర్థమైంది చంద్రికకు.

పై మాటలకు పొడిగింపుగా మళ్లీ అంది అత్తగారు.

"మీ మామగారు చాలా సంతోషంగా ఉన్నారు. అంత డబ్బు ఇక్కడ సంపాదించాలంటే ఎన్నాళ్ళు పట్టాలి. వాడ్ని అమెరికా పంపించి మంచి పనే చేశాం. లేకుంటే ఈ అప్పులు ఎప్పుడు తీరేను. మనం బిజినెస్‌లో మళ్లీ ఎప్పుడు నిలదొక్కుకొనేను అంటున్నారు.

కొడుకు పుట్టగానే తల్లిదండ్రులకు కలిగేది కేవలం సంతోషం. కొడుకు ప్రయోజకుడయినప్పుడే నిజమైన పుత్రోత్సాహం కలిగేది అని ఇందుకే అంటారు" అంటూ కొడుకును తలచుకుని మురిసిపోతోంది ఆ తల్లి.

మౌనంగా తల వంచుకుని ప్లేటులోని ఉప్మాను చెంచాతో కెలకడం తప్ప సమాధానం ఇవ్వలేదు చంద్రిక.

ఇవ్వాలని కూడా అనిపించలేదు. అయినా ఇవ్వడానికి ఏముందని? ఏదైనా మాట్లాడినా... ఆమాటల వెనక ఉన్న తన మనసుని ఎవరు అర్థం చేసుకుంటారు?

అందరూ పై పై సానుభూతి చూపించి తెచ్చిపెట్టుకున్న ఆప్యాయతలతో, ప్రేమతో పలకరించే వాళ్లేగానీ తన అంతరంగం ఎవరికి కావాలి?' అనుకుంది చంద్రిక.

అలా అనుకుంటున్నప్పుడు భర్త హర్షవర్ధన్ గుర్తుకు వచ్చాడు.

అతని అంతరంగం ఏమిటో తెలుసుకోవాలని అనిపించగానే చటుక్కున లేచి బెడ్‌రూంలోకి వెళ్ళి తలుపేసుకుని ఫోన్ డయల్ చేసింది.

"హలో..."

భర్త గొంతు గంభీరంగా వినపడగానే కోటి వీణలు ఒక్కసారిగా గుండెలో మ్రోగినట్లు అనిపించింది చంద్రికకు.

"హలో...నేను చంద్రికను"

"చంద్రికా నువ్వా?" అవతలినుంచీ చెప్పలేనంత ఆనందం.

అది గమనించి మనసంతా ఆనందంతో పులకరించిపోయింది చంద్రికకు.


"బాగున్నారా?"

"నువ్వు దగ్గర లేకుండా నేనెలా బాగుంటానను చంద్రికా. ఎడబాటును నువ్వొక్కదానివే అనుభవిస్తున్నానని అనుకుంటున్నావు కదూ.

## పారిశుధ్యంపై పెట్టుబడులు

నగరీకరణ, జనాభా పెరుగుదలవల్ల సహజ వనరులపై అంతులేని వత్తిడి ఏర్పడుతోంది. పేదరికం, ఆర్థిక వనరుల కొరత పరిసరాలను మరింతగా దిగజారుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా మహానగరాల్లోని మురికి కూపాల్లో కొన్ని కోట్లమంది ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనా ప్రకారం 2.4 బిలియన్ల ప్రజలు పారిశుధ్య వసతులు లేక బాధపడుతున్నారు. అలాగే 1.1 బిలియన్ ప్రజలకు రక్షిత మంచినీటి సౌకర్యంలేదు. 2015 నాటికి మరో 1.5 బిలియన్ల ప్రజలకు మెరుగు పరచిన తాగునీటి సరఫరా, 1.9 బిలియన్ ప్రజలకు ప్రాథమిక పారిశుధ్య వసతులు కల్పించడానికి వివిధ దేశాలు ప్రతిజ్ఞ చేసాయి. పరిశుద్ధ నీరు, పారిశుధ్యం కొరవడడంవల్ల వార్షికంగా, ప్రపంచవ్యాప్తంగా 1.6 మిలియన్ల ప్రజలు మరణిస్తున్నారు. రక్షిత, పరిశుభ్రమైన, ఆరోగ్యమైన నీరు, పారిశుధ్య సౌకర్యాలు ప్రజల ఆరోగ్యాన్ని ఎంతగానో మెరుగుపరుస్తాయి. రాజకీయ సంకల్పం, తగిన చట్టాలు చేయడం, ఆర్థిక వనరుల కేటాయింపులు పెంచడం, మహిళా సంఘాలతో కలిసి పనిచేయడంవల్ల పారిశుధ్య సౌకర్యాలు మెరుగుపడగలవని ఆశిస్తున్నారు. తాగునీరు, పారిశుధ్యంపై పెట్టిన పెట్టుబడులు అంతకు మరెన్నో రెట్లు ఆర్థిక ప్రయోజనాలు సమకూరుతాయని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి.

-డా. నమ్మెట



మగవాడు బయటపడడు. ఆడది బైటపడుతుంది. అందుకే మీ బాధ తప్ప మా బాధ ఎవరికీ కనిపించదు.

నిన్నక్కడ ఒంటరిగా వదిలేసి వచ్చినందుకు నేనెంత బాధపడుతున్నానో నీకు చెప్పినా అర్థం కాదు. నాకు ఇక్కడ ప్రతిక్షణం ఓ యుగంలా గడుస్తోంది.

ఇప్పుడంటే ఇప్పుడు రెక్కలు కట్టుకుని నీ దగ్గర వాలిపోవాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది'' ఒక్కోమాటా ఒక్కో అమృతపు చుక్కలా వచ్చి చెవిలో రాలుతున్నట్టు అనిపించింది చంద్రికకు.

"చంద్రికా. నీకు నామీద చాలా కోపంగా ఉంది కదూ''

"గొంతు వరకూ ఉంది.. కానీ ఇప్పుడే అది కొంచెం కిందికి జారింది''

"నిజంగా?!''

"ఎందుకని అడగరేం?''

"ఎందుకు?''

"మీరుకూడా నాలాగే అక్కడ విరహావస్థలో ఉన్నందుకు జాలితో..''

"నువ్వు వద్దంటున్నా వినకుండా వచ్చినందుకు నాకిది పనిష్మెంట్! క్షమించు చంద్రికా. నిన్ను చాలా బాధపెడుతున్నాను. కన్నవారి పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతల ధ్యాసలో కట్టుకున్న దాన్ని అన్యాయం చేస్తున్నానన్న ఆలోచన నాకు స్థిమితం లేకుండా చేస్తోంది.

'ఏక్ పానేక వియే ఏక్ ఖోనా పడతాహై' అంటారు హిందీలో. అది ఇదే కాబోలు. సరే ఏం చేస్తాం?

ఒకసారి ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత అంత త్వరగా దాన్ని మార్చుకోవడం ప్రాక్టికల్‌గా సాధ్యపడదు కదా... అది సరేగానీ చంద్రికా...ఇక్కడినుంచి నీకో మంచి కానుక పంపించాలనుకుంటున్నాను. ఏం కావాలి నీకు?'' ప్రేమగా అడిగాడు హర్షవర్ధన్.

"నాకు మీరే కావాలి. ఇవ్వగలరా ఆ కానుకని?''

"మళ్లీ అదే మాట..!''

"నేనేం చెయ్యనండీ.. ఎన్నిసార్లు మీరు అడిగినా నా మనసులోంచి ఇదే సమాధానం వస్తుంది. భార్యకు భర్తను మించిన కానుక మరేముంటుంది? డబ్బు, నగలు, చీరలు, ఇలాంటివి మీరు అక్కడినించి నాకు ఎన్ని పంపించినా మీ సామీప్యం ముందు నాకవన్నీ అల్ప విషయాలే. నేను మంచి చీర కట్టుకున్నా, అందమైన నగపెట్టుకున్నా అవన్నీ మీకోసమేగా.. మీరు చూడని, మీరు మెచ్చుకోని అలంకరణలు నాకెందుకు?

మీరు ఉంటే నాకు అన్నీ ఉన్నట్టే... మీరు లేకుంటే నాకు అన్నీ ఉన్నా లేనట్టే..'' ఆ ఆఖరి మాటలంటున్నప్పుడు చంద్రిక గొంతు గద్గదికమైంది.

"ఇలా మాట్లాడి నన్నింకా బాధపెడతావెందుకు చంద్రికా.. నీ మాటల్లోని బాధ, నిష్ఠూరం వింటుంటే నిన్ను వదిలి ఇక్కడికి వచ్చినందుకు నేను చాలా గిల్టీ ఫీలవుతున్నాను. భర్తగా నిన్ను సంతోషపెట్టలేని, సుఖపెట్టలేని నా మీద నాకే కోపం వస్తోంది...'' అని హర్షవర్ధన్ అనగానే వెన్నలా కరిగిపోయింది చంద్రిక మనసు.

తను అనుకున్నది నిజమే...

'భార్యకు దూరం ఉండవలసి రావడం భర్తకూ విరహవేదనను కలిగిస్తుంది' అనుకుంది చంద్రిక జాలిగా.

ఇన్నాళ్ళూ భర్త ప్రేమను తను తక్కువగా అంచనా వేసినందుకు సిగ్గుపడింది. 'ఇకనుంచైనా నిష్ఠూరాలు, దెప్పిపొడుపులూ లేకుండా ఆయన మనసుకు సాంత్వన కలిగేలా మాట్లాడాలి' అని నిశ్చయించుకుంది.

"ఐయామ్ సారీ... నా బాధను, భావాలను పంచుకునే మీరు దొరికేసరికి నా మనసు గోడు నాకు తెలియకుండానే బయటపడిపోతోంది. ఇంకోసారి మిమ్మల్ని ఇలా అస్సలు కష్టపెట్టను. మీ నిర్ణయాన్ని గౌరవించి, మీ బాధ్యతలలో నేనూ భాగం పంచుకుని మీకు సహకరించడానికి ప్రయత్నిస్తాను.

అందాకా...ఎవరో సినిమా కవి అన్నట్టు 'విరహము కూడా సుఖమే కాదా..' అని పాట పాడుకుంటూ సుందరస్వప్నంలో, అందమైన ఊహల్లో మిమ్మల్ని దర్శిస్తూ డ్యూయెట్స్ కూడా పాడేసుకుంటాను. వెండితెర మీద చూపించినట్లు'' అంది చంద్రిక నవ్వుతూ.


"అయితే నేనూ ఇక్కడ అదే పనిలో ఉండనా? అలా చేస్తే విరహానికి కాస్త ఉపశమనం దొరుకుతుందేమో...లెటజ్ ట్రై..'' అన్నాడు హర్షవర్ధన్ అవతలినుంచి.

ఆ మాటలకు గలగలా నవ్వింది చంద్రిక.

ఆ నవ్వు తనమీద వెన్నెల జాలు కురిపిస్తున్నట్లుగా అనిపించిందేమో అతనికి.

"అది! అలా ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి నువ్వు'' అన్నాడు ప్రేమగా.

★



## ప్రత్యేకత

ఇప్పుడు వార్తల్లో తారగా వెలుగొందుతున్నాడు సల్మాన్‌ఖాన్. వివాదాల నించి తాత్కాలికంగా ఉపశమనం పొందిన సల్మాన్ ఇప్పుడు ఓ పవర్‌ఫుల్ పాత్రతో జనం ముందుకి రాబోతున్నాడు. 'ఆపరేషన్ అర్జున్' అని పేరు పెట్టిన ఈ కొత్తచిత్రంలో ప్రత్యేకంగా కన్పించనున్నాడు. బోనీకపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ఆహారనియమాలు పాటిస్తూ క్రమం తప్పకుండా జిమ్‌కి వెళుతున్నాడు సల్మాన్. ఈ చిత్రం పూర్తయ్యేనాటికి సల్మాన్‌లో మనం ఓ కొత్త మనిషిని చూడొచ్చన్నమాట.

